క్లుప్తంగా

నేడు ఊటుకూరులో జగనన్న సురక్ష

కడప వైఎస్సార్ సర్కిల్ : నగర శివార్లలోని 45వ డివిజన్ ఊటుకూరులో సోమవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కార్పొరేటర్ గుత్తిరెడ్డి అంకమ్మ తెలిపారు. ఈ కార్యక్రమానికి కమలాపురం ఎమ్మెల్యే పి. రవీంద్రనాథరెడ్డి హాజరవుతున్నట్లు చెప్పారు.

శిల్పారామంలో చిన్నారుల సందడి



కడప కల్చరల్ : శిల్పారామంలో ఆదివారం ఆట విడుపు కార్యక్రమంలో భాగంగా సాంస్కృతిక వేదికపై కళాకారులు, చిన్నారులు తమ ఆటపాటలతో సందడి చేశారు. మిస్ర్బా మూవీ పద్మాకర్ సహకారంతో అఖిల్ డ్యాన్స్ అకాడమీ చిన్నారులు పలు జానపద, శాస్త్రీయ నృత్యాలను ప్రదర్శించారు. వారినృత్యాలకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. శిల్పారామం పాలనాధికారి శివప్రసాద్‌రెడ్డి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మానవ హక్కులను కాపాడటమే ధ్యేయం

కడప వైఎస్సార్ సర్కిల్ : మానవ హక్కులను కాపాడటమే ధ్యేయమని కాంగ్రెస్ పార్టీ హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ అన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరాభవన్‌లో హ్యూమన్ రైట్స్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సిద్దయ్యను నియమించి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ హక్కులను కాపాడటమే ధ్యేయంగా పని చేస్తూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు విష్ణుప్రీతం రెడ్డి, బాబు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడులు

పెండ్లిమర్రి : రైతులు పంటల సాగు ప్రకృతి వ్యవసా య పద్ధతిలో సాగుచేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు పొందవచ్చునని రైతు సాధికార సంస్థ ప్రతినిధి డి.వి.రాముడు తెలిపారు. ఆదివారం మండలంలోని చెన్నంరాజుపల్లెలో ప్రకృతి వ్యవసాయంతో సాగుచేసిన పంటలను ఆయన పరిశీలించి మా ట్లాడారు. ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపేలా వారికి అవగాహన కల్పించాలన్నారు. మహిళా సంఘాల్లో ఉన్న మహిళా రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో అడిషినల్ డీపీఎం వసుంతకుమారి, ఎస్ఎఫ్ఏ మేరి, సీనియర్ కన్సల్‌టెంట్ సురేంద్రరెడ్డి, రైతు గంగిరెడ్డి పాల్గొన్నారు.

ఆదినిమ్మాయపల్లెలో నాకాబందీ



కలంలో తనిఖీలు చేస్తున్న ఎస్ఐ పెద్దఓబన్న

వల్లూరు : మండలంలోని ఆదినిమ్మాయపల్లెలో ఆదివారం పోలీసులు నాకాబందీ నిర్వహించారు. ఎస్ఐ పెద్దఓబన్న ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది గ్రామంలో విస్తృతంగా తనిఖీలను నిర్వహించారు. గ్రామంలోని గృహాలు, ఖాళీ ప్రదేశాలు, కలాలలో క్షుణ్ణంగా సోదాలను చేపట్టారు. అనంతరం స్థానికులతో సమావేశాన్ని నిర్వహించి అసాంఘిక కార్యకలాపాలకు, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చిన్న చిన్న విషయాలకు తగాదాలు పడి గొడవలకు పాల్పడి కేసుల పాలు కావద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు తెలియచేయాలని సూచించారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : మండలంలోని జంభాపురం, పెద్దచెప్పలి సచివాలయాలలో సోమవారం నిర్వహించే జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని ఎంపీడీఓ చలపతి ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు తిప్పిరెడ్డిపల్లె, రంపతాడుకు..

పెండ్లిమర్రి : మండలంలోని తిప్పిరెడ్డిపల్లెలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రాన్ని సోమవారం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ప్రారంభిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే రంపతాడు గ్రామంలో జరగనున్న జగనన్న సురక్ష కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

రేపు నైమిశారణ్య పీఠాధిపతి రాక

చాపాడు : మండలంలో ముఖ్య పుణ్యక్షేత్రమైన అల్లాడుపల్లె శ్రీవీరభద్ర స్వామి దేవస్థాన సన్నిధికి మంగళవారం హిందూ ధార్మిక సేవా సంస్థ వ్యవస్థాపకులు శ్రీకాకుళం నైమిశారణ్య పీఠాధిపతి బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి రానున్నట్లు ఆలయ ఈఓ శ్రీనివాసులు తెలిపారు. వీరభద్ర స్వామి సన్నిధిలో ఉదయం 9 గంటలకు శ్రీ శివలీల విలాసం ప్రవచనాలు బోధిస్తారన్నారు. వీరభద్ర స్వామి భక్తులందరూ హాజరుకావాలని ఆలయ ఈఓ కోరారు.

దారి వెంట చెట్లు తొలగించండి



ఆచారి కాలనీ- వరద కాలనీ మధ్యలో చెట్ల కొమ్మలతో మూసుకుపోయిన దారి

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలోని రామాంజనేయపురంలో పీఎఫ్ క్వార్టర్స్ నుంచి వరదకాలనీకి పోయే మార్గం చెట్లు, చెత్తాచెదారంతో మూసుకుపోయింది. ఏపుగా పెరిగిన చెట్లు రోడ్డుపైకి పెరగడంతో దారి కనిపించడం లేదు. వీధి దీపాలు ఉన్నప్పటికీ రాత్రిళ్లు అంధకారం అలుముకుంటోంది. చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఈ దారి వెంట నడిచేందుకు భయపడుతున్నారు. చెట్ల కొమ్మలు రోడ్డుపైకి రావడం వల్ల కార్లు, లగేజీ వాహనాలకు ఆ కొమ్మలు గీసుకుపోతున్నాయి. ఏపుగా పెరిగిన ఈ చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలు తాకుతుండటంతో వర్షాలు వచ్చినప్పుడు ప్రమాదకరంగా మారింది. అధికారులు స్పందించి రోడ్ల వెంట ఏపుగా పెరిగిన ఈ చెట్ల కొమ్మలను, పిచ్చి మొక్కలను తొలగించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

వైవీయూ : కడప నగరం నుంచి బుగ్గరోడ్డుకు వెళ్లే రహదారిలోని ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదం పొంచి ఉంది. సాయిప్రతాప్ నగర్ నుంచి శ్రీచైతన్య విద్యాసంస్థలకు వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ బేస్ పూర్తిగా శిథిలమై కూలిపోయేందుకు సిద్ధంగా ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌కు ఎటువంటి రక్షణ కూడా లేదు. ప్రధాన రహదారిపై ఉండటం, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం లేకపోలేదు.. ఇప్పటికైనా అధికారులు ప్రమాదం చోటుచేసుకోకముందే తగిన రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దేశం తలదించుకునేలా మణిపూర్‌లో హింస



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నాయకులు



మాట్లాడుతున్న షా మహమ్మద్

కడప కార్పొరేషన్ : దేశం యావత్తు తలదించుకునేలా మణిపూర్‌లో హింసాత్మక ఘటనలు జరుగుతున్నాయని రక్షణ స్వచ్ఛంద సంస్థ, సీజేపీ ఫౌండేషన్ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ కూడలిలో 'స్టాప్ వయోలెన్స్-సేవ్ మణిపూర్' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థ అధ్యక్షుడు పి. సంపత్ కుమార్, చైతన్య మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడం దారుణమన్నారు. కార్యక్రమంలో జై భీమ్ మాల మహాసేన ఉపాధ్యక్షురాలు కె. లావణ్య, దళిత హక్కుల సమాఖ్య అధ్యక్షుడు బి. ఓబయ్య, శ్యాంసన్, శ్రీదేవి పాల్గొన్నారు.

మాయని మచ్చలా మణిపూర్ ఘటనలు

మణిపూర్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలు దేశానికి మాయని మచ్చలా మిగిలిపోతున్నాయని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు షా మహమ్మద్, సౌత్ ఇండియా ప్రెసిడెంట్ షాజహాన్ అన్నారు. ఆదివారం వారు మాట్లాడుతూ మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు, దాడులు, హత్యలు అత్యంత పాశవికంగా ఉన్నాయన్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సిద్ధయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ సర్దార్ అబ్దుల్లా, సిటీ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా, టి. స్వర్ణకుమారి, రాజగోపాల్ పాల్గొన్నారు.

మణిపూర్‌లో హింసాకాండను ఆపాలి

కడప వైఎస్సార్ సర్కిల్: మణిపూర్‌లో జరుగుతున్న హింస కాండను బీజేపీ ప్రభుత్వం ఆపాలని ఏపీ మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు పఠాన్ మహ్మద్ అలీఖాన్ అన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఆయన మాట్లాడుతూ మహిళలపట్ల అమానుషంగా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. మణిపూర్‌లో 70 రోజుల నుంచి విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యాన్ని తొలగించడం దారుణమన్నారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న జమాల్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్ : ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర మహాసభలు ఆగస్టు 12వ తేదీన గుంటూరులో జరుగుతాయని ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అందరూ అత్యధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్ రెడ్డి, ఉమ్మడి కడపజిల్లా చైర్మన్ మోపూరు శివారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం కడప పీఆర్‌టీయూ కార్యాలయంలో ఉమ్మడి కడపజిల్లా ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ కార్యవర్గ సమావేశాన్ని జిల్లా చైర్మన్ శివారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర కో చైర్మన్ లెక్కల జమాల్‌రెడ్డి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ స్థాపించి ఐదేళ్లకాలంలో ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల అనేక సమస్యలు పరిష్కరించిందన్నారు. ముఖ్యంగా ఎంపీడీవీలకు పదోన్నతులు, వీఆర్ఏ, ఏఆర్వోలకు ప్రమోషన్లు, పాలిటెక్నికల్ అధ్యాపకులకు పీఆర్‌సీ ఇప్పించామన్నారు. 1998, 2008 డీఎస్సీ వారికి పోస్టులను ఇప్పించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ మోపూరు శివారెడ్డి, ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బోరెడ్డి వరదారెడ్డి, జిల్లా కో చైర్మన్ పల్లెం సుబ్బారెడ్డి, వైఎస్సార్ టీఎఫ్ రాష్ట్ర అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సజ్జల రమణారెడ్డి, ఎన్‌సీసీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జూనియర్ లెక్చరర్స్‌అసోసియేషన్ అధ్యక్షుడు రామక్రిష్ణారెడ్డి, ఏపీటీజీ అసోసియేషన్ అధ్యక్షుడు బాలశౌరిరెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర సీపీఎస్ కన్వీనర్ గుజ్జల తిరుపాల్, ఎస్ఆర్‌టీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నాగేశ్వరావు, పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ విద్యా ప్రదాత డాక్టర్ బీఎస్ రావు





బీఎస్‌రావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా- మాట్లాడుతున్న నగర మేయర్ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్ : వైద్య వృత్తిని వదిలి విద్యారంగంలో సంచనాలను సృష్టించిన బీఎస్ రావు దేశం గర్వించదగ్గ విద్య ప్రదాత అని ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాష, డిప్యూటీ మేయర్ సురేష్‌బాబు అన్నారు. ఆదివారం కడప నగరంలోని మాధవి కన్వెన్షన్‌హాల్‌లో బీఎస్‌రావు సంస్కరణ సభ శ్రీచైతన్య విద్యాసంస్థల రాయలసీమ ఏజీఎం డేరంగుల రమణయ్య అధ్యక్షతన ఘనంగా జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ డాక్టర్ బొప్పన సత్యనారాయణరావు(బీఎస్ రావు) రెండు తెలుగు రాష్ట్రాల్లో విద్యార్థులకు మేలిమి విద్యను అందిస్తూ విద్యారంగంలోనే సరికొత్త ఒరవడి సృష్టించారన్నారు. గుంటూరు జిల్లా అంగలూరు అనే చిన్న గ్రామంలో జన్మించిన బీఎస్ రావు లక్షలమంది విద్యార్థులను ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజనీర్లుగా తీర్చిదిద్దారని తెలిపారు. బీఎస్ రావు , ఆయన సతీమణి ఝాన్సీ ఇద్దరూ వైద్యులుగా ఇంగ్లాండ్, ఇరాన్, ఇరాక్‌లలో 12 ఏళ్ల వైద్య సేవలందించి తర్వాత విజయవాడకు వచ్చి విద్యాసంస్థలను ఏర్పాటు చేశారన్నారు. కమలాపురం ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నాయని అన్నారు. కార్యక్రమంలో మాజీ టీటీడీ పాలక మండలి సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు, విద్యా సంస్థల రాయలసీమ ఏజీఎం డేరంగుల రమణయ్య కూడా ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు నారాయణ, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ రంగనాథరెడ్డి, చైతన్య కళాశాల డీఎన్ విజయభాస్కర్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు నాగరాజు ఏఓలు మనోజ్‌రెడ్డి, మల్లికార్జున స్వామి, శ్రీచైతన్య స్కూల్స్ ప్రిన్సిపాళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

లయన్స్ నూతన కమిటీ ప్రమాణం



లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం

కడప కల్చరల్ : లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం స్థానిక మానస ఇన్ హోటల్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సంస్థ అధ్యక్షుడు లయన్ పి.ఖాసింఖాన్ మాట్లాడుతూ ప్రజల్లో సేవా భావాన్ని పెంచేందుకే లయన్స్ క్లబ్ ఏర్పాటైందన్నారు. పాస్ట్ గవర్నర్లు సీహెచ్ రమేష్‌నాథరెడ్డి సంస్థ నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించగా, లయన్ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి నూతన సభ్యులను సభకు పరిచయం చేశారు. లయన్ ప్రముఖులు గునిశెట్టి శ్రీనివాసులు, అధ్యక్షులు లయన్ డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, కార్యదర్శి లయన్ వి.గౌరీశంకర్‌ల పర్యవేక్షణలో నూతన కమిటీ అధ్యక్షుడిగా పోతుల వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యక్షులుగా వలికెల గౌరీశంకర్, కారపురెడ్డి చంద్ర ఓబుల్‌రెడ్డి, కార్యదర్శిగా కొండూరు జనార్దన్‌రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సహ కార్యదర్శిగా బోగాల కొండారెడ్డి, కోశాధికారిగా దేవతి రవీంద్రనాథ్, సహ కోశాధికారిగా ముఖేష్‌కుమార్‌లను ఎన్నుకున్నారు. అనంతరం వివిధ విభాగాలకు చైర్మన్లుగా తొమ్మిది మంది వైద్యులు, 16 మంది ప్రముఖులను బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ ప్రముఖులు కె.కృష్ణమూర్తి, షేక్ అబ్దుల్లా, జి.గుల్జార్‌బాష, జె.పవన్‌కుమార్, పీఎస్ హరినాథరెడ్డి, పీవీ రమేష్ పాల్గొన్నారు.

కడప పార్లమెంటు కాపునాడు అధ్యక్షుడిగా రవి

ముద్దనూరు : కడప పార్లమెంటు నియోజకవర్గ కాపునాడు అధ్యక్షుడిగా ఆకుల రవికుమార్ నియమితులయ్యారు. మండలంలోని బొందలకుంట గ్రామానికి చెందిన తనను రాయలసీమ కాపునాడు జోన్ అధ్యక్షుడు వీరాంజనేయులు, జాతీయ కాపునాడు అధ్యక్షుడు సుబ్రహ్మణ్యంలు నియమించారని, కాపు, బలిజ, ఒంటరి కులాల వారి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని ఆకుల రవికుమార్ తెలిపారు.

గ్రంథాలయం తనిఖీ

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి ఎస్.అమిరుద్దీన్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రంథాలయంలో రికార్డులు, రోజువారి గ్రంథాలయ సందర్శకుల రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చాపాడులోని శాఖా గ్రంథాలయంలో 292 మంది సభ్యత్వం మాత్రమే ఉన్నాయని పాఠకుల సంఖ్య మరింత పెంచాలని సూచించారు. క్రమం తప్పకుండా గ్రంథాలయాన్ని పాఠకులకు అందుబాటులో ఉంచాలని, ప్రతి ఏటా వేసవి శిక్షణా తరగతులను నిర్వహించాలని సూచించారు.

ప్రాచీన యుద్ధ కళలు అంతరించిపోకుండా చూడాలి



విద్యార్థులకు ధనుర్విద్యలో శిక్షణ ఇస్తున్న ప్రముఖ ధనుర్విద్య ఆచార్యులు ఉదయకుమార్

బద్వేలు అర్బన్ : ప్రాచీన యుద్ధ కళలు అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని ప్రముఖ ధనుర్విద్య ఆచార్యులు ఉదయకుమార్ తెలిపారు. స్థానిక సరస్వతి శిశుమందిరంలో ప్రాచీన యుద్ధ కళలైన విలువిద్య, ఖడ్గవిద్య, దండవిద్య, శబ్దభేరి, ధ్యానం, యోగా శిక్షణ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. ప్రాచీన యుద్ధ కళలకు ఎంతో ప్రత్యేకత ఉందని, వీటిని సాధన చేయడం వలన గ్రహణశక్తి, మనోధైర్యం, మానసిక ఉల్లాసం కలుగుతాయన్నారు. అంతేకాకుండా ఆత్మరక్షణకు దోహదపడుతుందన్నారు. సరస్వతి శిశుమందిరం ప్రధాన ఆచార్యులు తులసిశివానంద, కమిటీ సభ్యులు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేఖర్‌రావు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించండి

రాయచోటి టౌన్ : ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని పీఆర్‌టీయూ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ కొండూరు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. ఆదివారం రాయచోటి డైట్ కేంద్రంలో పీఆర్‌సీటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన పీఆర్‌సీ బకాయిలు, పాత డీఏలన్నీ కలిపి చెల్లించాలన్నారు. ఉపాధ్యాయుల కొరత వలన విద్యా ప్రమాణాలు తగ్గుతున్నాయన్నారు.

సాహిత్య కార్యక్రమాల నిర్వహణకు 'జింకా' కృషి



వక్త కొత్తపల్లి శ్రీనును సత్కరిస్తున్న అతిథులు

కడప కల్చరల్ : జిల్లాలో సాహిత్య కార్యక్రమాలను నిర్వహించడంలో జింకా సుబ్రమణ్యం ఎంతో కృషి చేస్తున్నారని కొత్తపల్లి శ్రీను కొనియాడారు. ఆదివారం యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఉపాధ్యాయులు, సాహితీవేత్త కొత్తపల్లి శ్రీను నెల నెలా సీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా 'జింకా సుబ్రమణ్యం-జీవితం' అనే అంశంపై మాట్లాడారు. కవిగా, రచయితగా, తెలుగు ఉపన్యాసకుడిగా, పాత్రికేయుడిగా, సాహిత్య సంస్థల సారథిగా జింకా సుబ్రమణ్యం నాలుగు దశాబ్దాలుగా అక్షర సేవ చేస్తున్నారని కొనియాడారు. ప్రొద్దుటూరుకు చెందిన సుబ్రమణ్యం సాహిత్యంపైగల అభిమానంతో వందలాది సాహిత్య కార్యక్రమాలు నిర్వహించారన్నారు. కార్యక్రమ ప్రారంభంలో బ్రౌన్ కేంద్రం పూర్వ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్‌భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, లైబ్రరీ అసిస్టెంట్ జి.హరిభూషణరావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట రమణ, మౌనిక, గ్రంథాలయ సలహా మండలి సభ్యులు జానమద్ది విజయ భాస్కర్, సాహితీవేత్త గానుగపెంట హనుమంతరావు తదితరులు వక్తను, ముఖ్య అతిథిగా హాజరైన జింకా సుబ్రమణ్యంను ఘనంగా సత్కరించారు.

పేద ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పులివెందుల రూరల్ : పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని జిల్లా విజిలెన్స్ మానటరింగ్ కమిటీ మెంబర్ కిషోర్ ఆదివారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో తెలిపారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో కన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత పేదరికం సగం వరకు తగ్గిందని స్వయానా నీతి ఆయోగ్ తన నివేదికలో వెల్లడించిందన్నారు. 2016 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో 11.77 శాతం నిరుపేదలు ఉండగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వంలో 2021 డిసెంబర్ నాటికి పేదరికం 6.06 శాతానికి తగ్గిందన్నారు. సీఎం ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు



గంగమ్మ తల్లిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. అలాగే ఆలయ సమీపంలోని ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగమ్మతల్లిని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నగర మేయర్ కె.సురేష్‌బాబులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏపీ మహిళా కమిషన్ మెంబర్ గజ్జల లక్ష్మీ ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నారు.

అచ్చివెళ్లి గంగమ్మకు ప్రత్యేక పూజలు

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని అచ్చివెళ్లి గ్రామ సమీపంలో వెలసిన అచ్చివెళ్లి గంగమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోరిన కోరికలు తీర్చే గంగమ్మతల్లిగా ఎంతో ప్రసిద్ధి గాంచింది. కడప, కర్నూలు, అనంతపురం తదితర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్

కడప ఎడ్యుకేషన్ : నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని అధ్యాపకుడు సీహెచ్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం కడప నగరంలో రెండవరోజు నిర్వహించిన పీడీఎస్‌యూ రాష్ట్రస్థాయి రాజకీయ శిక్షణ తరగతుల్లో ప్రభుత్వ విద్య- విద్యార్థుల కర్తవ్యాలు అనే అంశంపై బోధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం ద్వారా విద్యార్థుల్లో మనువాద భావజాలాన్ని ఎక్కిస్తున్నారన్నారు.కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్, పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ ఎం.రామక్రిష్ణ, రాష్ట్ర అధ్యక్షుడు గనిరాజు సహాయ కార్యదర్శి అంకన్న, కిరణ్‌కుమార్,ఉపాధ్యక్షులు వినోద్,సునీల్, జునైద్‌బాష, కోశాధికారి జాకీర్, నాయకులు నాగరాజు, జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విలువలతోనే ఉత్తమ సమాజం



మాట్లాడుతున్న రాటాల గోపి

కడప కల్చరల్ : అందరూ ఉన్నత విలువలను పాటిస్తే ఉత్తమ సమాజం ఏర్పడుతుందని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సెంట్రల్ కమిటీ డైరెక్టర్ రాటాల గోపి అన్నారు. ఆదివారం సంస్థ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగర అధ్యక్షుడు పి.సుబ్బరాయుడు తమ సంస్థ లక్ష్యాల గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సి.సుబ్బారెడ్డి, జేవీ రాంప్రకాశ్, డాక్టర్ నవీన్ ప్రసాద్ , బైరెడ్డి రామకృష్ణారెడ్డి, శివ విష్ణుమోహన్ రెడ్డి, రెడ్డెన్న, పి.సుబ్రమణ్యం, నాగలక్ష్మి, డాక్టర్ నీలవేణి, ఉష, తులసి, లక్ష్మీనారాయణరెడ్డి, యల్లారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సమ్మెట సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజల మధ్య చిచ్చు పెడుతున్న బీజేపీ ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్

కడప వైఎస్సార్ సర్కిల్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఓట్ల కోసం ప్రజల మధ్య కుల, మతాల చిచ్చు పెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం నగరంలోని సీపీఎం కార్యాలయంలో యూసీసీని వ్యతిరేకించండి- దేశాన్ని రక్షించండి.. అనే అంశంపై వివిధ, ప్రజా, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని హిందూ, ముస్లిం, క్రైస్తవులు, జైనులందరికీ ప్రత్యేక పర్సన్ లాలు రాజ్యాంగం ద్వారా పార్లమెంట్ ఆమోదించిందన్నారు. 2018 జాతీయ లా కమిషన్‌లో ఈ చట్టాలకు రాజ్యాంగ రక్షణ ఉందన్నారు. ప్రధాని మోడీ రాజ్యాంగాన్ని మట్టిలో కలిపి ఆర్ఎస్ఎస్ హిందుత్వ అజెండాను అమలు చేయడంలో భాగంగానే జమ్ము కాశ్మీర్‌లో ప్రత్యేక హక్కుల చట్టం ఆర్టికల్ 370, ఈశాన్య రాష్ట్రాలకు ఇచ్చిన హక్కులను, 35-ఎ రాజ్యాంగ హక్కులను రద్దు చేయాలని చూస్తోందన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో మారణ హోమం జరుగుతోందని ఇది బీజేపీ అశాస్త్రీయ నిర్ణయాల అమల్లో భాగమేనని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాజకీయ, ప్రజా సంఘాల నాయకులు బాబు, సల్లా వుద్దీన్, దస్తగిరి, సత్తార్, చార్లెస్, రామ్మోహన్ ఐఎన్ సుబ్బమ్మ పాల్గొన్నారు.

శివాలపల్లె ప్రజల కల సాకారం



శివాలపల్లెకు వేసిన సీసీ రోడ్డు

చెన్నూరు : మండలంలోని శివాలపల్లె గ్రామ ప్రజల కల సాకారమైంది. శివాలపల్లి దళితవాడ నుంచి శివాలపల్లె మెయిన్ వరకు రూ.40 లక్షలతో సిమెంట్‌రోడ్డు నిర్మాణం పూరైంది. దీంతో గ్రామస్తులు ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డికి కృతజ్ఞతలను తెలిపారు. గతంలో ఈ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారేది. ఈ రోడ్డున వెళ్లాలంటే ప్రజలు నరకయాతన పడేవారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి రూ.40 లక్షల నిధులు మంజూరు చేయించడంతోపాటు శరవేగంగా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయించాడు. దీంతో శివాలపల్లి, వల్లూరు మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తీరినట్లు అయింది.